ఉమ్మడి జిల్లాలో చలి పంజా

రంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి పంజా విసురుతోంది. చలి తీవ్రతకు ప్రజలు వణికిపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇళ్ల నుంచి అడుగు బయట పెట్టాలంటేనే గజగజలాడుతున్నారు. చల్లని గాలులకు చిన్న పిల్లలు, వృద్ధులు అవస్థ పడుతున్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 10.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, మేడ్చల్-మల్కాజిరిగి జిల్లా 12.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.




పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ రాజేష్

డయల్ 100 కాల్స్‌పై సత్వరమే స్పందించాలి

చౌదరిగూడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డయల్ 100కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ సూచించారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్‌ను షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్యతో కలిసి సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆపదలోని వారు 100కు కాల్ చేస్తే వెంటనే స్పందించి తగిన సాయమందించాలన్నారు. ప్రజలు సైబర్ హ్యాకర్ల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. రాత్రి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు. స్టేషన్ పరిధిలో నేరాల పరిస్థితిపై ఎస్ఐ విజయ్‌ని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తలకొండపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ నాగార్జున కోరారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. పాఠశాల రికార్డులను, పరిసరాలను, వంట గది, స్టోర్ రూంను, కూరగాయలను, మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విషయంలో ఉదాసీనతకు తావివ్వకూడదని, పరిసరాలను, వంట గదులను శుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎస్‌వో రేణుక, ఆర్ఐ మంజుల ఉన్నారు.





తాండూర్: దేవనూర్‌లో ధాన్యం లోడింగ్ చేస్తున్న బిహారీ హమాలీలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఉమ్మడి జిల్లాలో..	
కొనుగోలు కేంద్రాలు	150
మొత్తం హమాలీలు	1,546
స్థానికులు	626
బిహారీలు	920

హమాలీ.. బిహారీ!

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వారే అధికం



- కాంటాలు వేసేందుకు ముందుకు రాని స్థానికులు
- వచ్చినా అధిక కూలి డిమాండ్
- ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేస్తున్న బిహారీలు
- వారికి కూలి కూడా తక్కువే
- వారివైపే కేంద్రాల నిర్వాహకుల మొగ్గు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఇబ్బడి ముబ్బడిగా ధాన్యం వస్తోంది. ఉదయం నుంచి రాత్రి వరకు కాంటాలు వేసినా ఇంకా రాశులు అధికస్థాయిలోనే ఉంటున్నాయి. ఈ తరుణంలో కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసేందుకు బిహార్ కూలీలే కీలకమయ్యారు. స్థానికులు కాంటాలు వేసేందుకు ముందుకు రాకపోవడం, కొన్నిచోట్ల వచ్చినా అధిక కూలీ డిమాండ్ చేస్తుండడంతో కేంద్రాల నిర్వాహకులు బిహారీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఎక్కువమంది వారే పనిచేస్తున్నారు. స్థానిక హమాలీల కంటే బిహారీలు ఎక్కువ సమయం పనిచేస్తుండడంతో వారివైపే కేంద్రాల నిర్వాహకులు మొగ్గు చూపుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలన్నీ బిహారీ హమాలీలతో నిండిపోయాయి.

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, నవంబరు 28: ఉమ్మడి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా మారి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. స్థానిక హమాలీల కంటే ధర తక్కువగా తీసుకోవడంతో పాటు పనులను వేగంగా చేస్తుండడంతో కేంద్రాల నిర్వాహకులు వారివైపే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం క్వింటాల్ వడ్లను బస్తాల్లో నింపి, తూకం వేసి లోడ్ చేసినందుకు స్థానిక హమాలీలు సుమారు రూ.60 తీసుకుంటున్నారు. దీనికి తోడు స్థానిక హమాలీలకు వ్యవసాయం కూడా ఉండడంతో కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో జాప్యం చేస్తున్నారు. దీంతో రైతులు తమ ధాన్యం కాంటాలు వేయడంలో ఆలస్యం అవుతుందని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై

మిగతా 7వ పేజీలో...

జిల్లాలో నేడు

శంషాబాద్‌కు మంత్రి శ్రీధర్‌బాబు రాక

వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించనున్న మంత్రి

శంషాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నర్కూడ ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో శుక్రవారం నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించడానికి రానున్నట్లు డీఈవో సుశీందర్ రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. భవిష్యత్ నిర్మాణంలో శాస్త్ర, సాంకేతిక పాత్ర అనే అంశంపై దాదాపు 500 ప్రాజెక్టులు ప్రదర్శించబడుతాయని చెప్పారు.

ఫార్మాసిటీ భూముల పరిశీలన

యాచారం, కందుకూరు మండలాల్లో గోప్యంగా పర్యటించిన కలెక్టర్

యాచారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాచారం, కందుకూరు మండలాల్లో కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంత రెడ్డి గురువారం సందర్శించారు. వారి పర్యటన గోప్యంగా జరిగింది. గత ప్రభుత్వం యాచారం మండలం తాటిపర్తి, కుర్మిద్ద, కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట గ్రామాలలో సేకరించిన ఫార్మాసిటీ భూములను వారు పరిశీలించారు. ఈ భూముల్లో తక్షణం కంపెనీలు నిర్మించుకునేందుకు ఏ ప్రాంతం అనువుగా ఉందని పరిశీలించారు. ఫార్మాకు భూములు కోల్పోయిన రైతులకు కేటాయించిన ప్లాట్ల దగ్గరికి వెళ్లి చూశారు. అనంతరం తాటిపర్తి, మీర్‌ఖాన్‌పేట వైపు కలెక్టర్, ఆర్‌డీవోలున్న కార్లు వెళ్లిపోయాయి. కాగా కుర్మిద్దలో పోలీస్ స్టేషన్ కోసం కొంత భూమిని కేటాయించడానికి అధికారులు నిర్ణయించినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న వీఆర్వోలు

రెవెన్యూ శాఖలో చేర్చాలని వీఆర్వోల వినతి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇతర శాఖల నుంచి తిరిగి రెవెన్యూ శాఖలోకి మార్చాలని కోరుతూ గురువారం వీఆర్‌వోలు కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. దాదాపు 40 శాఖల్లో వీఆర్వోలు పనిచేస్తున్నారని, అక్కడ ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. వినతి చేసిన వారిలో బీఆర్వోల సంఘం జిల్లా నాయకులు ఉన్నారు.

షాద్‌నగర్‌లో కోటి దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

షాద్‌నగర్‌రూరల్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతీ భారతీయుడిపై ఉందని ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో గురువారం ఏర్పాటు చేసిన కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాజధానికే పరిమితమైన కోటి దీపోత్సవాన్ని షాద్‌నగర్‌లోనూ నిర్వహించడం గొప్ప విషయమని తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించారు. ఆచార్య గౌరయ్య వేదోపన్యాసం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సింగారం శ్రీనివాస్ దంపతులు, యాదగిరి నివాస్ దంపతులు, మున్సిపల్ చైర్మన్ నరేందర్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

మహిళల అభివృద్ధికి ప్రోత్సాహం

డీఆర్‌డీవో పీడీ శ్రీలత

నందిగామ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మహిళా అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని డీఆర్‌డీవో పీడీ శ్రీలత అన్నారు. గురువారం నందిగామ మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. బ్యాంకు రుణాలు, పీఎంఎఫ్ఎంఈ, కోళ్ల పెంపకం, చిన్న తరహా వ్యాపారాలు, ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్లు, మహిళా సమాఖ్య సాధించిన ప్రగతిపై చర్చించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆమె సందర్శించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద తెలంగాణ రైసింగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. సూర్యారావు, యాదగిరి, అనురాధ, అరుణ, యాదయ్య పాల్గొన్నారు.



కడ్తాల రైతు వేదిక వద్ద సిక్కిం బృందం

పల్లె ప్రగతి పనులు భేష్

సిక్కిం గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధుల బృందం కితాబు

కడ్తాల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులు భేషగ్గా ఉన్నాయని సిక్కిం రాష్ట్ర గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధుల బృందం కితాబు ఇచ్చింది. అలాగే కడ్తాల గ్రామ పంచాయతీ అభివృద్ధి పనుల రూపకల్పన, ప్రగతిని వారు ప్రశంసించారు. జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖల(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పంచాయతీల పనితీరుపై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణలో పాల్గొనడానికి వచ్చిన సిక్కిం బృందం గురువారం కడ్తాల గ్రామ పంచాయతీలో పర్యటించింది. టీం కో-ఆర్డినేటర్ జరీనా నేతృత్వంలోని సభ్యులు కడ్తాల రైతు వేదిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ, వైకుంఠధామం, స్వయం సహాయక సంఘాల దుకాణాలు, పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో, ప్రత్యేక అధికారి సుజాత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, ఎంపీవో విజయ్‌పాల్, ఐకేపీ ఏపీఎం రాజేశ్వరీదేవి, మహిళాపొదుపు సంఘాల సభ్యులు, నాయకులు లాయక్‌అలీ, మూడ అశోక్, చేగూరి మహేశ్, క్యామ వెంకటేశ్, ఉపేందర్, మహేశ్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

యాచారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన వంట నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం యాచారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవన్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు వంట నిర్వహణకు అప్పులు చేసి వాటికి వడ్డీ కూడా చెల్లించలేని దుస్థితి నెలకొందన్నారు. సకాలంలో బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, గత ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.బ్రహ్మయ్య, చందూనాయక్, జంగయ్య, పార్వతమ్మ, లక్ష్మమ్మ, సాల్లమ్మ, కళమ్మ పాల్గొన్నారు.

టీజీవోల సమస్యల పరిష్కారానికి కృషి

సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు



సమావేశానికి హాజరైన టీజీవోల అసోసియేషన్ నాయకులు

రంగారెడ్డి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీజీవోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు అన్నారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యవర్గ సమావేశాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో గెజిటెడ్ అధికారుల సంఘానికి హాల్, పక్కా బిల్డింగ్ నిర్మాణం కోసం కలెక్టర్‌ను కలవాలని తీర్మానించారు. సమావేశంలో భాగంగా కొత్తగా ఇద్దరు వైస్ ప్రెసిడెంట్లను, నలుగురు జాయింట్ సెక్రటరీలను నామినేట్ చేశారు. వైస్ ప్రెసిడెంట్‌లుగా బాలరాజుగౌడ్, గంపా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా సైదమ్మ, మహేందర్, భూక్యా రాకేష్, నాగేశ్వర్ రావును నియమించారు. ఉద్యోగులకు ఇండ్ల స్థలాల కోసం సొసైటీగా ఏర్పడాలని, డివిజన్ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి సంఘాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె. రామారావు, కార్యదర్శి శ్రీనేష్‌కుమార్ నోరి, సెంట్రల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ, శ్రీరామ్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రెసిడెంట్, రంగారెడ్డి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశం, ట్రెజరర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎస్.వెంకట్, ఎం.అలివేలు మంగ, రేవతి, ప్రధాన కార్యదర్శులు లక్ష్మణస్వామి, మహేశ్వరి, ఈసీఎం కె. నరేందర్ పాల్గొన్నారు.

అనుకూల స్థలంలోనే ఆసుపత్రి ఏర్పాటు

కొత్తూర్, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి ప్రజలకు అనుకూల స్థలంలోనే ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీ కొత్తూర్‌కు దూరంగా, ప్రజలకు అనుకూలంగా లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యపై కౌన్సిలర్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే పట్టణానికి సమీపంలో ఉన్న భవనాన్ని గుర్తించి ఆస్పత్రిని అందులోకి షిఫ్ట్ చేయాలని వైద్య శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. దీంతో డీఎంహెచ్‌వో గురువారం ఎమ్మార్వో భవనం, పశువుల ఆస్పత్రి, పాత మున్సిపల్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, నిర్మాణంలో ఉన్న కూరగాయాల మార్కెట్ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ.. తాను పరిశీలించిన భవనాల నివేదికను ఎమ్మెల్యే శంకర్‌కు, ఉన్నతాధికారులకు పంపి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, కౌన్సిలర్ హేమదేవేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



భవనాలు పరిశీలించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

ప్రశ్నిస్తేనే అవినీతి అంతం



సర్వేను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ ఒక్కరు ప్రశ్నిస్తేనే అవినీతి అంతం అవుతుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఆధ్వర్యంలో గురువారం అవినీతి నిర్మూలనపై చేపట్టిన సర్వేను నర్సింహులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చాలా మంది ఉద్యోగులు ప్రజాధనాన్నే వేతనంగా తీసుకుంటున్న విషయాన్ని మరచి ప్రతీ పనికి లంచం ఆశిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దాడులు చేసినా, అవినీతి అధికారులను జైళ్లకు పంపినా అవినీతి ఆగడం లేదన్నారు. లంచావతారుల ఇండ్లలో కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు, కోట్లాది రూపాయల కరెన్సీ కట్టలు, కోట్లాది ఆస్తులు వెలుగు చూస్తున్నాయన్నారు. ప్రజలు చైతన్యమై లంచాలు అడిగే వారిని నిలదీస్తేనే అవినీతి తగ్గుతుందని నర్సింహులు అన్నారు. 'యూత్ ఫర్ యాంటీ కరప్షన్'ను స్థాపించి ముందుకు సాగుతున్న రాజేంద్ర, డాక్టర్ ప్రవంతి, కె.రమేష్‌బాబు, జి.హరికృష్ణలను ఆయన అభినందించారు.

తప్పుల్లేకుండా డాటా ఎంట్రీ చేయాలి



మండల పరిషత్‌లో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి


చేవెళ్లనవంబరు 28(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే వివరాలను తప్పుల్లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి సూచించారు. గురువారం చేవెళ్ల, షాబాద్ మండలాల్లో కంప్యూటర్ డాటా ఎంట్రీ విధానాన్ని ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన సామాజిక విద్య, ఉద్యోగ, కుల గణన డాటాను తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. ప్రతీ కుటుంబం డాటా ఫామ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. తప్పులు ఎంట్రీ చేస్తే అందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెలాఖరుకల్లా డాటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో విఠలేశ్వర్, షాబాద్ ఎంపీడీవో అపర్ణ, సూపరింటెండెంట్ రవీందర్ ఉన్నారు.

కేజీబీవీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



కేజీబీవీ వద్ద నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు, టీచర్లు

కడ్తాల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య అన్నారు. కడ్తాల కేజీబీవీని గురువారం భోజన విరామ సమయంలో యూటీఎఫ్ నాయకులు సందర్శించారు. సమస్యలడిగితెలుసుకున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేజీబీవీ సిబ్బందికి కనీస వేతనాలివ్వాలని, ఎస్‌వోలకు ప్రిన్సిపాళ్లకు కల్పిస్తున్న వసతులివ్వాలని, ఉద్యోగులకు సెలవులివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని జంగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిసెంబరు 9 నుంచి 13 వరకు సీఎంకు లేఖలు పంపడం, 22 నుంచి 25 వరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, జనవరి 7న కలెక్టరేట్ల వద్ద సామూహిక నిరశన దీక్షలు, 28న హైదరాబాద్‌లో మహాధర్నా, ఫిబ్రవరిలో చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ఉపాధ్యక్షురాలు కౌసల్య, నాయకులు మల్లయ్యగౌడ్, భీముడు, నర్సింహమూర్తి, భాగ్యలక్ష్మి, యూసూబా, టీచర్లు సిబ్బంది పాల్గొన్నారు.






















పత్తి రైతులకు తిప్పలు

- అప్పులు మిగిల్చిన కాటన్ సాగు
- వర్షాల్లేక మోడుగా మొక్కలు
- సగానికి పడిపోయిన దిగుబడి
- సీసీఐ కొనుగోలు కేంద్రం లేక దక్కని మద్దతు ధర
- ఇబ్రహీంపట్నంలో సీసీఐ సెంటర్ ఏర్పాటు చేయాలంటున్న రైతులు


పత్తి తీస్తున్న కూలీలు

యాచారం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధర ఎక్కువగా ఉంటుందని పత్తి పంట వేస్తే దిగుబడి సరిగా రాక.. వచ్చినదానికీ మద్దతు ధర లభించక రైతులు అప్పులపాలయ్యారు. క్వింటాల్‌కు రూ.7,300 సీసీఐ మద్దతు ధర ఉన్నా స్థానికంగా సీసీఐ కొనుగోలు కేంద్రం/జిన్నింగ్ మిల్లులు లేక, దూరప్రాంతాలకు తరలించలేక రైతులు స్థానిక దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోతున్నారు. ఇబ్రహీంపట్నం, మాల్‌లలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేక వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. మద్దతు ధర పొందాలంటే ఆమనగల్లు, షాద్‌నగర్, నల్గొండ జిల్లా చింతపల్లిలోని సీసీఐ కేంద్రాలకు పత్తి తరలించాలి. అంత దూరం తీసుకెళ్లలేక, రవాణా ఖర్చులు సైతం భరించలేక గ్రామాలకు వచ్చే దళారులకు తక్కువ రేటుకు పత్తిని అమ్ముకుంటున్నారు. ఇదిలా ఉంటే పత్తి గూడ దిగే, కాత కాసే సమయాల్లో వానల్లేక దిగుబడి తగ్గింది. ఒక్కసారి పత్తి తీయగానే మొక్కలు మోడువారాయి. వర్షాలు బాగా కురిస్తే డిసెంబరు రెండో వారం దాకా పత్తి కాసేది. ఈ సారి వర్షాలు తక్కువ కురియడంతో మొదటి కాతతోనే సరిపెట్టినట్టయింది. ఈ నేపథ్యంలో పత్తి సాగుతో అప్పులే మిగిలాయని రైతులు వాపోతున్నారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో అయినా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే మద్దతు ధరన్నా దక్కేదని రైతులంటున్నారు. యాచారం మండలంలో వానకాలం 2,030 ఎకరాల్లో పత్తి సాగు చేశారని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.


ఒక్క సారికే మోడుగా మారిన పత్తి మొక్కలు

సాగు ఖర్చులు తడిసి మోపెడు!

ఎకరం దుక్కి దున్నేందుకు రూ.4వేలు, విత్తనానికి రూ.6వేలు(ఒక్కో ప్యాకెట్ రూ.2వేలు), విత్తేందుకు రూ.3వేలు, కలుపు తీతకు రూ.6,200, రసాయన మందులకు రూ.16వేలు, పత్తి తీతకు మరికొంత వెరసి ఎకరం పత్తి పంట సాగు చేసి అమ్ముకునే వరకు 35వేల నుంచి 40వేల ఖర్చు అవుతుందని మేడిపల్లికి చెందిన రైతు బీరప్ప చెప్పాడు. పట బాగా పడితే ఎకరంలో 15క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉంది. అయితే ఈ సారి ఏడెనిమిది క్వింటాళ్ల దిగుబడే వస్తోందని రైతులు చెబుతున్నారు. దీంతో పెట్టుబడి అయినా రాక అప్పులే మిగిలాయని అన్నదాతలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే వివిధ గ్రామాల నుంచి దళారులు పత్తి తక్కువ ధరకు సేకరించి షాద్‌నగర్, ఆమనగల్లు, చింతపల్లిలోని సీసీఐ కేంద్రాలకు, జన్నింగ్ మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరను వారే పొందుతున్నారు.

దుర్భరంగా కౌలు రైతుల పరిస్థితి

మండలంలోని కౌలు రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. పత్తి సాగుకు ఎకరం భూమికి రూ.2,500 చొప్పున భూ యజమానులకు కౌలు రైతులు చెల్లిస్తున్నారు. పంట పండినా, పండకున్నా ఈ మొత్తం చెల్లించాల్సిందే. కొందరు పట్టాదారులైతే పంట వేసేకంటే ముందే డబ్బు తీసుకుంటున్నారు. చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, మాల్, మేడిపల్లి, నందివనపర్తి, తాటిపర్తి, కుర్మిద్ద, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, తమ్మలోనిగూడ గ్రామాల్లో చాలా మంది కౌలు రైతులు పత్తి వేశారు. పట్టా రైతు కంటే కౌలు రైతులకు మరింతగా ఖర్చు పెరుగుతుందని రైతులు ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. పత్తికంటే మక్కజొన్న, జొన్న, కూరగాయ పంటలు వేయడమే మేలనిపిస్తోందని రైతులు మైసయ్య, శ్రీశైలం, బీరప్ప, వెంకయ్య అభిప్రాయ పడ్డారు.

ఎకరానికి 8 క్వింటాళ్లే వచ్చింది



నేను నాలుగు ఎకరాల్లో పత్తి సాగుచేశాను. ఎకరానికి 8క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. పంటంతా అమ్మినా పెట్టుబడి రాక అప్పు తీరేలా లేదు. దళారులు క్వింటాల్‌కు రూ.6,500 ఇస్తున్నారు. పత్తికి కనీస ధర రూ.13వేలుంటేనే గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం మద్దతు ధర పెంచి రైతులను ఆదుకోవాలి.

- ఐలయ్య, రైతు, కొత్తపల్లి

'పట్నం'లో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం ఇబ్రహీంపట్నంలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా చేస్తే స్థానికంగా దళారులకు అమ్మే పరిస్థితి ఉండదు. వరి, కూరగాయలు, ఇతర మెట్ట పంటల కంటే పత్తిసాగుకు ఖర్చెక్కువవుతుంది. కాబట్టి వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై పత్తి విత్తనాలు, రసాయన మందులు అందిస్తే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.

- లాలూనాయక్, రైతు, కుర్మిద్ద తండా

అర్హతకు మించి వైద్యం చేసిన ఏడుగురు ఆర్‌ఎంపీలపై కేసు

తాండూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా రోగులకు ఆపరేషన్లు, అర్హతకు మించిన వైద్యం చేస్తున్నారని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదుతో తాండూరులో ఏడుగురు రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ల(ఆర్‌ఎంపీల)పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ కుమార్ గురువారం చెప్పారు. ఆర్‌ఎంపీలు అర్హత లేకున్నా ఎంబీబీఎస్ డాక్టర్ల తరహాలో వైద్యం చేస్తూ డాక్టర్లుగా చెలామణీ అవుతూ రోగుల ప్రాణాల మీదికి తెస్తున్నారు. తాండూరులో ఇటీవల ఓ ఆర్‌ఎంపీ కాలు నొప్పితో వచ్చిన ఓ వృద్ధురాలికి ఇంజక్షన్ ఇవ్వగా ఆమె కాలు చచ్చుబడి పోయింది. దీంతో అధికారులు దాడులు చేసి కొన్ని ఆర్‌ఎంపీ క్లినిక్‌లను సీజ్‌చేశారు. తాండూరులో పాషా ఫస్టెయిడ్ సెంటర్(ఇస్మాయిల్ పాషా), పీపుల్స్ ఫస్టెయిడ్ సెంటర్(మన్సూర్ షేక్), లక్ష్మణ్‌రావు ఫస్టెయిడ్(సునిత్ కుమార్), శ్రీబాలాజీ ఫస్టెయిడ్ సెంటర్(గణపతిరావు), విజయ్ క్లినిక్ (సల్మాన్), యూసుఫ్ ఫస్టెయిడ్ సెంటర్(ఎండీ మౌలానా), రక్షిత పాలి క్లినిక్, రెడ్డి క్లినిక్‌లకు చెందిన సురేందర్‌రెడ్డిలపై కేసులు నమోదు చేశారు.

డిసెంబరులో సీఎం కప్ టోర్నీ

● నిర్వహణకు మండల కమిటీలు

తాండూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):'చీఫ్ మినిస్టర్స్ కప్-2024' క్రికెట్ టోర్నీని నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పోటీలను ఈ యేడాది కాస్త ఆలస్యంగా చేపడుతున్నారు. డిసెంబరు మొదటి వారంలో పోటీలు జరుగనున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తారు. గ్రామ స్థాయిలో డిసెంబరు 7, 8 తేదీల్లో, మండల/నియోజకవర్గ కేంద్రాల్లో డిసెంబరు 10, 11, 12 తేదీల్లో, అలాగే జిల్లాస్థాయిల్లో డిసెంబరు 16 నుంచి 21 వరకు నిర్వహిస్తారు. మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే పోటీల్లో విజేతలను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. పోటీలకు మండల స్థాయి కమిటీలను నియమిస్తారు. గతంలో ఎంపీపీలు కన్వీనర్లుగా వ్యవహరించేవారు. ప్రస్తుతం పాలకవర్గాలు లేనందున స్పెషలాఫీసర్లు కన్వీనర్లుగా కమిటీలేర్పాటుచేసే అవకాశం ఉంది. తాండూరు మున్సిపాలిటీ, పెద్దేముల్, యలాల, బషీరాబాద్, తాండూరు మండలాలు విద్యార్థులు, యువత పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంది.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌కు వచ్చే నెల 6న శంకుస్థాపన

● హాజరుకానున్న ఆరోగ్య శాఖ మంత్రి, అసెంబ్లీ స్పీకర్

తాండూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.150కోట్లతో ఈ భవన నిర్మాణానికి డిసెంబరు 6న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు శంకుస్థాపన చేస్తారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా ఆహ్వానించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. యాలాల మండలం దౌలాపూర్‌లో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ భారీఎత్తున నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

అక్రమ నిర్మాణం కూల్చివేత


అనుమతి లేని నిర్మాణాన్ని కూల్చుతున్న అధికారులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని కృష్ణా పైప్‌లైన్ బైపాస్ రోడ్డు పక్కన భవానీ నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన ఓ చర్చి(ప్రార్థనా మందిరం)ని మున్సిపల్ అధికారులు గురువారం కూల్చివేశారు. సుచిరా బార్ అండ్ రెస్టారెంట్ పక్కన అక్రమంగా చర్చి నిర్మిస్తున్నారు. దీంతో కాలనీ వాసుల ఫిర్యాదుతో అధికారులు జేసీబీతో నిర్మాణాన్ని కూల్చివేశారు. అనుమతుల్లేకుండా, ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేసినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవీందర్ సాగర్ హెచ్చరించారు.

విద్యుత్ అధికారులు రైతులను ఇబ్బందిపెడితే ఊరుకోం


మాట్లాడుతున్న కిసాన్ సంఘ్ నాయకులు

షాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీలకు, వ్యాపార సంస్థలకు టీజీఐఐసీ కేటాయించిన దేవాదాయ భూముల నుంచి విద్యుత్ లైన్ల తొలగింపుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్ అన్నారు. గురువారం ఎర్రోనిగూడలో ఆయన మాట్లాడుతూ.. సీతారాంపూర్‌లోని రామచంద్రస్వామి ఆలయ భూముల పక్కన పోతుగల్, లక్ష్మరావుగూడ, ఎర్రోనిగూడ, మల్‌రెడ్డిగూడ, గోపిగడ్డ, పోలారం గ్రామాల రైతుల పట్టాభూములు ఉన్నాయన్నారు. ఏళ్ల కింద ఆలయ భూముల్లో పాతిన విద్యుత్ స్తంభాలు, లైన్లను అధికారులు తొలగిస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆలయ భూముల్లోని విద్యుత్ లైన్లు, డీటీఆర్‌లను తొలగిస్తే వెంటనే వాటిని పట్టా భూముల్లో సాగు చేస్తున్న రైతులకు అనుకూలంగా అమర్చి సేద్యానికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల నాయకులు అయూబ్, యాదవరెడ్డి, వీరేశం, సత్యంగౌడ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఐజీ


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ సత్యనారాయణ

వికారాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం మల్టీజోన్-2 డీఐజీ సత్యనారాయణ సందర్శించారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓఎల్‌ఎక్స్‌లో డీలింగ్‌తో మోసం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓఎల్‌ఎక్స్ యాప్‌లో ఫోన్ కోసం డబ్బు చెల్లించి వ్యక్తి మోసపోయిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో వెలుగు చూసింది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా దివం చెరువుకు చెందిన దాసరి సాయిగౌడ్(26) పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో ఉంటున్నాడు. ఈ నెల 24న ఓఎల్‌ఎక్స్ యాప్‌లో ఫోన్ కోసం బ్రౌజ్ చేశాడు. ఓ ఫోన్ రూ.79,000కు ఉందని కిరణ్ అనే వ్యక్తి తెలిపాడు. దీంతో ఇద్దరూ మాట్లాడుకొని ఫోన్ రూ.79వేలకు క్రయవిక్రయాలకు ఒప్పందం చేసుకున్నారు. కిరణ్ క్యూఆర్ కోడ్ పంపి డబ్బు చెల్లించాలని చెప్పాడు. దీంతో సాయిగౌడ్ ఐదుసార్లు రూ.79వేలు ఓఎల్‌ఎక్స్ యాప్ ద్వారా పంపాడు. అయితే మూడు రోజులైనా తనకు ఫోన్ రాకపోవడంతో కిరణ్‌కు పలుమార్లు ఫోన్ ట్రై చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన సాయిగౌడ్ తనకు జరిగిన మోసంపై పోచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైల్వే అండర్ పాస్ నిర్మించాలి

రైల్వే ఉన్నతాధికారులను కోరిన జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి


అండర్ పాస్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న రైల్వే అధికారులు

మేడ్చల్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కట్టి ప్రజల కష్టాలు తీర్చాలని మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి రైల్వే ఉన్నతాధికారులను కోరారు. గురువారం రైల్వే సీనియర్ డీఈఎన్ ముత్యాలనాయుడు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఐవోబీ వి.విద్యాధర్‌లతో కలిసి గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్ వంతెన ఏర్పాటుకోసం స్థల పరిశీలన చేశారు. వంతెన లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులపై అధికారులకు వివరించారు. రైల్వే ట్రాక్ నుంచి అండర్ పాస్ లేక 44వ నంబర్ జాతీయ రహదారికి అర కిలోమీటర్ దూరం ఉన్న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చేరాలంటే చుట్టూ 7కిలో మీటర్లు తిరిగి రావాల్సిన వస్తోందని తెలిపారు. కండ్లకోయం-గుండ్లపోచంపల్లిల మధ్య ఉన్న రైల్వే అండర్ పాస్ పనులు పూర్తి కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేస్తే కేవీ రెడ్డి కాలనీ, లక్ష్మీనగర్, మానిక్‌రెడ్డి కాలనీల మీదుగా రాకపోకలకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైల్వే అండర్ పాస్ లేక విద్యార్థులు, వృద్ధులు రైలు పట్టాలపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నారని, వాహనదారులు చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్నారని తెలిపారు. స్పందించిన అధికారులు తమ సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి రైల్వే అండర్ పాస్ నిర్మించేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్, టెక్నాలజీపై శ్రద్ధ పెట్టాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయాధికారి శీతల్

వికారాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్, టెక్నాలజీలపై శ్రద్ధపెట్టి నేర్చుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయాధికారి డీటీ.శీతల్ అన్నారు. గురువారం జనవిజ్ఞాన వేదిక వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగడి బాలికల రెసిడెన్షియల్‌లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన శీతల్ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో అమ్మాయిలు ముందు వరుసలో ఉండాలన్నారు. తరచూ పోటీ పరీక్షల్లో పాల్గొంటూ విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు మనందరం బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సాయిలత, జేవీవీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ


ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లాల్‌కృష్ణ

పరిగి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అన్ని రకాలుగా చేయూతనిస్తామని బీసీ సంక్షేమ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో గురువారం పరిగిలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, చిట్యాల్, సయ్యద్‌పల్లి, నస్కల్ పాఠశాలల్లోని 1,500 మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. లాల్‌కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లు, స్కూళ్ల విద్యార్థులకు తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రకాలుగా సేవలందిస్తామని, పుస్తకాలు, స్టేషనరీ తదితర వస్తువులు పంపిణీ చేస్తామని, పేద విద్యార్థులను ఆర్థికంగానూ ఆదుకుంటామని అన్నారు. పేద విద్యార్థులు పెద్ద చదువులు చదివి ఉన్నత శిఖరాలు చేరుకునేలా వెన్నుతట్టి ప్రోత్సాహకాలు అందిస్తామని వివరించారు. పరిగి ఎమ్మెల్యే సహకారంతోనూ సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బర్త్ డే కేక్‌ను కట్ చేశారు. ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో ఎం.ఎ.కరీం, ఏఎంసీ చైర్మన్ పరశరాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంతు, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పి.చిన్న నర్సింహులు, నాయకులు ఆనెం ఆంజనేయులు, ఎన్.రామకృష్ణ, సర్వర్, పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.


శంకర్‌పల్లిలో ధాన్యాన్ని తూర్పార పడుతున్న బిహార్ కూలీలు


శామీర్‌పేటలో ధాన్యాన్ని లోడ్ చేస్తున్న బిహార్ కూలీలు

హమాలీ.. బిహారీ!

(5వ పేజీ తరువాయి)

వాదనకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో బిహార్ హమాలీలు తక్కువ సమయంలో ఎక్కువ ధాన్యాన్ని కాంటాలు వేస్తుండడంతో నిర్వాహకులు వారినే ఎక్కువగా పనిలో పెట్టుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో పత్తి పంట కూడా చేతికి రావడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించుకుంటున్నారు. వారితోనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. స్థానిక హమాలీలు గిట్టుబాటు కూలి దక్కడం లేదని చాలావరకు కేంద్రాలకు రావడం లేదు. మూడేళ్ల నుంచి బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీలను ముందస్తుగా కొంత అడ్వాన్స్ ఇచ్చి తీసుకొస్తున్నారు.

పనుల వేగిరం..

బిహార్‌కు చెందిన కూలీలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బీహార్ హమాలీలు పనిచేస్తుంటే, స్థానికులు మాత్రం 9గంటలకు వచ్చి సాయంత్రం 6గంటలకు వెళ్లిపోతున్నారు. కేంద్రాల్లో రైతు ధాన్యం పోసిన తర్వాత దాన్ని ఆరబెట్టడం, మిషన్ ద్వారా శుభ్రం చేయడం, కాంటా వేయడం, బస్తాలను లారీల్లోకి ఎత్తడం తదితర పనులన్నీ బిహార్ కూలీలతోనే జరుగుతున్నాయి. ముఖ్యంగా స్థానిక హమాలీల కంటే బిహార్ నుంచి వచ్చిన కూలీల ద్వారానే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, రైతులతో పాటు నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రతి ఏటా వానాకాలం, యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వివిధ రకాల పనుల నిర్వహణకు బిహార్ కూలీలు జిల్లాకు వస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకుని రేయింబవళ్లు పనిచేస్తున్నారు. కేంద్రాల్లో కొనుగోళ్ల పనులన్నీ పూర్తయిన తర్వాతే వీరంతా తమ స్వస్థలానికి వెళ్లిపోతారు. దాదాపు రెండు మాసాలకు పైగా కేంద్రాల్లో పనిచేస్తారు.


పరిగి మండలం సుల్తాన్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు లోడ్ చేస్తున్న బిహార్ కార్మికులు

కూలి తక్కువే

బిహారీ కూలీలు ధాన్యం క్వింటాల్‌కు రూ.40 కూలి తీసుకుంటున్నారు. స్థానిక హమాలీల కంటే రూ.20 తక్కువ గానే తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఉన్న హమాలీలు రోజుకు ఒక లారీ లోడ్ చేస్తే, బిహారీ హమాలీలు రోజుకు రెండు లారీలను నింపి మిల్లులకు పంపిస్తున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు తెచ్చిన ధాన్యం త్వరితగతిన కొనుగోలు కేంద్రాల నుంచి తరలిపోతుంది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి పడిగాపులు పడే పరిస్థితి తప్పింది.

ఐదేళ్ల నుంచి వస్తున్నాం



ఐదేళ్ల నుంచి శామీర్‌పేట వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి వస్తున్నాం. ఇక్కడ సీజన్ అయ్యేవరకు నెల రోజులు పని లభిస్తుంది. స్థానిక హమాలీలు, రైతులతో కలిసి పనిచేస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేదు.

- సర్వన్‌కుమార్, బిహార్ హమాలీ

గిట్టుబాటు అవుతోంది



క్వింటాల్‌కు రూ.40 చెల్లిస్తున్నారు. దీంతో ఇంతదూరం వచ్చినందుకు మాకు గిట్టుబాటు అవుతుంది. లోడింగ్, అన్‌లోడింగ్, బస్తాలు కుట్టడం, తూకం వేయడం లాంటి పనులు చేస్తున్నాం.

- కైలాశ్‌కుమార్, బిహార్ హమాలీ

ఇక్కడెక్కువ కూలి



ఇక్కడ నెల, రెండు నెలలు పని ఉంటుంది. బిహార్‌లో కంటే ఇక్కడ కూలి ఎక్కువ లభిస్తోంది. హమాలీ చేసిన డబ్బులు ఒకేసారి చేతికి వస్తాయి. ఇక్కడి వారు మాకు ఫోన్ చేసి పిలిస్తే ఇక్కడకు వచ్చాం.

- బ్రజేష్, హమాలీ, బిహార్

పనులు త్వరగా పూర్తి చేస్తారు



బిహార్ కూలీలు వేగంగా పనులు చేస్తారు. తూకం కూడా బాగా వేస్తారు. వీళ్లు ఎక్కువ సమయం పనిచేసి తూకం ఆలస్యం కాకుండా చూస్తారు. ఎక్కువ పని ఉన్నా కాదనకుండా చేస్తారు.

- అనంతయ్య, రైతు, ధారూరు మండలం

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు


పూర్ణాహుతిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో గురువారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు అట్టహాసంగా నిర్వహించారు. నూతన ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం, హనుమాన్, సీతారామలక్ష్మణ, నవగ్రహ, గణపతి, నాగులు, శివ, నంది విగ్రహాలు, ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. చండీ ఉపాసకులు రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా యజ్ఞాలు, హోమాలతో ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి, బీజేపీ నాయకులు ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య, డి.అశోక్‌గౌడ్, ఆలయ కమిటీ కన్వీనర్లు వెంకటేష్‌గుప్తా, వెంకటయ్య, యాదయ్య, బి.కృష్ణ, శ్రీను, నర్సింహ, కె.అంజయ్య, బాలు, రాజు, శ్రీశైలం, సురేందర్, యాదయ్య, మహేష్, కె.శ్రీనివాస్, లెవన్‌స్టార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సన్మార్గానికి దైవ కార్యక్రమాలు దోహదం

ఆమనగల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మనుషులు సన్మార్గంలో నడిచేందుకు, సమాజశాంతికి దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు దోహదపడతాయని రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణపూర్‌లోని అభయాంజనేయస్వామి, కాశీ విశాలాక్షి ఆలయ వార్షికోత్సవానికి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయంలో పూజలు నిర్వహించారు.

వసతి గృహం.. నిరుపయోగం

- నిర్వహణ లేక అధ్వానంగా శంకర్‌పల్లి బీసీ బాలుర హాస్టల్
- ఏపుగా పెరిగిన చెట్లు, పేరుకుపోతున్న చెత్తాచెదారం
- కొవిడ్ టైంలో పిల్లలు లేరని శేరిలింగంపల్లికి తరలింపు.. ఇంటర్ విద్యార్థులకు వినియోగిస్తున్న అధికారులు
- వసతి గృహాన్ని శంకర్‌పల్లిలోనే నిర్వహించాలని స్థానికుల విన్నపాలు



శంకర్‌పల్లిలోని బీసీ వసతిగృహం



వసతి గృహ సముదాయం మధ్యలో ఏపుగా పెరిగిన చెట్లు

శంకర్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీసీ బాలుర వసతిగృహ భవనం నిరుపయోగంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని వెనుకబడిన సంక్షేమశాఖ అధికారులు గాలికొది లేశారు. దాంతో భవనంలో పిచ్చిమొక్కలు పెరిగి అడవిని తలపిస్తోంది. నాలుగేళ్ల క్రితం కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో విద్యార్థులు లేరనే సాకుతో వసతిగృహాన్ని శేరిలింగంపల్లికి తరలించారు. అయితే, శంకర్‌పల్లి పేరున ఇంటర్మీడియట్ పిల్లలకు శేరిలింగంపల్లిలో వసతి గృహాన్ని నడుపుతున్నారని సమాచారం.

భవనాన్ని వినియోగంలోకి తేవాలి

లక్షలు వెచ్చించి నిర్మించిన వసతిగృహం నేడు నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం బీసీ విద్యార్థుల కోసం అద్దె భవనాల్లో వసతిగృహాలను కొనసాగిస్తుండగా, ఇక్కడ మాత్రం ప్రభుత్వ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. వసతిగృహం మూసివేసిన అనంతరం అందులో ఉండే గ్యాస్ సిలిండర్, వంట సామగ్రి, బియ్యం తదితర వస్తువులు సంక్షేమశాఖ అధికారులు స్వాధీనం చేసుకోకుండా వదిలేయడంతో గుర్తుతెలియని దుండగులు వాటన్నింటినీ ఎత్తుకెళ్లారు. భవనం గదుల్లోని కిటికీలను విరగ్గొట్టి అందులో ఉన్న వస్తువులను ఎత్తుకెళ్లారు. వసతిగృహాన్ని ఇక్కడి నుంచి తరలించినప్పటికీ అందులోని వస్తువులను సంరక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. అయితే, ఇప్పటికైనా శేరిలింగంపల్లికి తరలించిన వసతిగృహాన్ని తిరిగి శంకర్‌పల్లిలో నడపాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ భవనాన్ని ఇతరత్రా అవసరాలకు ఉపయోగించుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, భవనాన్ని ఇలాగే వదిలేస్తే పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ఎందుకూ పనికిరాకుండా పోతుంది.

వసతిగృహాన్ని తిరిగి శంకర్‌పల్లిలో నడపాలి



కోవిడ్ సమయంలో విద్యార్థులు లేరనే సాకుతో శేరిలింగంపల్లికి వసతిగృహాన్ని తరలించారు. కోవిడ్ అయిపోయినాక అయినా వసతిగృహాన్ని శంకర్‌పల్లిలో నడపడం లేదు. బీసీ విద్యార్థులు వసతిగృహం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విశాలమైన భవనం ఉండి కూడా లాభం లేకుండా పోతున్నది. శేరిలింగంపల్లి నుంచి శంకర్‌పల్లికి వసతిగృహాన్ని తరలించాలి.

- దేవ ప్రవీణ్, శంకర్‌పల్లి

భవనం పాడవుతున్నా పట్టించుకోవడం లేదు



బీసీ వసతిగృహాన్ని శేరిలింగంపల్లికి తరలించడంతో శంకర్‌పల్లి వసతిగృహ భవనాన్ని ఉపయోగించడం లేదు. భవన ప్రాంగణంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అది చిన్న పాటి అడవిని తలపిస్తున్నది. దుండగులు కిటికీలను ధ్వంసం చేశారు. అధికారులు పట్టించుకోకపోతే భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంటుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా మేల్కొని భవనాన్ని ఉపయోగంలోకి తేవాలి.

- గొల్ల మల్లేశం, మహాలింగపురం

ఆదిభట్ల మున్సిపాలిటీలో 91.9 శాతం సమగ్ర సర్వే పూర్తి

- మిగిలినవారు కంట్రోల్ రూం నెంబరుకు ఫోన్‌చేసి వివరాలివ్వాలి
- మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే తుదిదశకు చేరుకుందని, ఇప్పటివరకు 91.9 శాతం సర్వే పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. మొత్తం 5,105 కుటుంబాలను గుర్తించగా 4,693 కుటుంబాల సర్వే పూర్తయిందని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో సర్వే ముగియనుందని, వివరాలివ్వని కుటుంబాలు ఉంటే కంట్రోల్‌రూం ఫోన్: 63034-35647ను సంప్రదించాలని సూచించారు. ఎవరైనా సరే ఫోన్‌చేస్తే ఎన్యూమరేటర్లు ఇంటికే వచ్చి వివరాలు తీసుకుంటారని కమిషనర్ తెలిపారు.

పెద్దగుట్టతండాను మా గ్రామంలో కలపొద్దు

కొత్తూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మక్తగూడ గ్రామపంచాయతీలో ఉన్న పెద్దగుట్టతండాను తమ గ్రామంలో కలపొద్దని గూడూరు గ్రామస్తులు ఎంపీవో విజయలక్ష్మికి గురువారం గ్రామంలో వినతిపత్రాన్ని అందజేశారు. మక్తగూడ గ్రామ పంచాయతీలో ఉన్న పెద్దగుట్టతండాను తమ గ్రామంలో కల్పొద్దని కోరుతూ గ్రామస్తులు జిల్లా, మండల అధికారులతో పాటు, రాష్ట్ర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్తూర్ ఎంపీవో విజయలక్ష్మి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. గ్రామస్తులందరు ముక్తకంఠంతో తమ గ్రామంలో పెద్దగుట్టతండాను కలపొద్దని వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు అందజేసిన వినతి పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాధిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, సీనియర్ అసిస్టెంట్ పవన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ మహేందర్, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.వీరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, సీనియర్ నాయకుడు సాత ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, లబ్ధిదారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : వీర్లపల్లి



కొందుర్గు మండలం ముట్పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చౌదరిగూడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, రైతుల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండలం ముట్పూర్ రైతు వేదికలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచనతో కలిసి ప్రారంభించారు. ముట్పూర్‌నకు చెందిన విద్యార్థిని పెద్దింటి శృతి 6వతరగతి చదువుతోంది. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికవ్వడంతో ఎమ్మెల్యే సన్మానించి రూ.5వేల ప్రోత్సాహకం అందజేశారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు రాజు, తదితరులున్నారు.

సారూ.. మీ కాళ్లు మొక్కుతా.. మా భూమిని ఇప్పించండి

సారూ.. మీ కాళ్లు మొక్కుతా.. మా భూమి మాకు ఇప్పించాలంటూ ఓ వృద్ధురాలు ఎమ్మెల్యే శంకర్‌ను వేడుకుంది. ముట్పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి శంకర్ వచ్చారు. గ్రామానికి చెందిన బుయ్యని లక్ష్మమ్మకు గ్రామ రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 282లో 11 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది ప్రతిపక్ష పార్టీ నాయకులు విక్రయించారని ఎమ్మెల్యేకు వివరించింది. బుధవారం పొలంలో మొక్కజొన్నలు వేశారని, ఎమ్మెల్యేకు వివరిస్తూ కన్నీటి పర్యంతమైంది. మీ కాళ్లు మొక్కుతా.. మా భూమి మాకు ఇప్పించాలని వేడుకుంది. మీరు పొలం ఎవరికైనా అమ్మారా? లేదా? అని ఎమ్మెల్యే ఆమెను అడిగారు. అక్రమంగా భూమిని లాక్కుంటే వదిలిపెట్టేది లేదని, గ్రామ నాయకులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలన్నారు.

కళాశాలల నిర్మాణానికి సీఎస్‌ఆర్ నిధులివ్వండి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ సమీపంలో నిర్మించతలపెట్టిన ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల నిర్మాణానికి హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి వచ్చే సీఎస్‌ఆర్ నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే శంకర్ కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయన్ను కలిసి నిధులు కేటాయించాలని కోరినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలున్నారు.

'రైతు పండగ'ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 30న మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రైతు పండగ, సీఎం బహిరంగ సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పదివేల మంది రైతులను సమీకరిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి రైతు పండగ సదస్సుకు వేలాదిగా రైతులు తరలివచ్చి విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో గురువారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర గిరిజనసేవా సంఘం అధ్యక్షుడు హన్మనాయక్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ తొలి ఏడాదిలోనే వివిధ పథకాల కింద రూ.55 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణాలను మాఫీ చేస్తోందని, సాంకేతిక కారణాలతో నిలిచిన 4లక్షల మందికి వారి ఖాతాల్లో 30న సీఎం చేతులమీదుగా జమచేయనున్నట్లు వివరించారు. బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనను జీర్ణించుకోలేక విషం కక్కుతున్నారని, ప్రభుత్వం, సీఎంను విమర్శించడమే దినచర్యలో భాగంగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.2.11కోట్లు

కల్వకుర్తి నియోజకవర్గంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, మరమ్మతులకు ప్రభుత్వం రూ.2.11 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాను సారం అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గానికి 2వేల స్ప్రింక్లర్లు మంజూరయ్యాయని, రైతులు సబ్సిడీపై రూ.7,500లకు పొందాలని కోరారు. నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణం, మరమ్మతు, ఆధునీకరణకు రూ.91 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, వారంరోజుల్లో నిధులు మంజూరుకానున్నాయని చెప్పారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, మానయ్య, బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'పట్నం'లో ఉచిత హోమియో వైద్యాలయం ప్రారంభం



ఇబ్రహీంపట్నం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్‌లో గురునానక్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత హోమియో వైద్యాలయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం చుట్టుపక్కల ప్రజలకు ఇది ఉపయోకరంగా ఉంటుందన్నారు. పవన్‌సాయి హాస్పిటల్స్ డైరెక్టర్లు డా.సతీష్, డా.ప్రియదర్శిని, కమిషనర్ రవీందర్ సాగర్, గురునానక్ హోమియోపతిక్ కళాశాల సూపరింటెండెంట్ డా.రేణుక తదితరులున్నారు.

ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం : కేఎల్లార్



మహేశ్వరం : జెన్నాయిగూడలో రైతులతో మాట్లాడుతున్న కేఎల్లార్

మహేశ్వరం/కందుకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఫ్యాబ్‌సిటీ భూ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, భూములు కోల్పోయిన ప్రతీ రైతుకు తగిన న్యాయం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. గురువారం జెన్నాయిగూడలో భూ నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రైతులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రజాసమస్యలను గాలికొదిలేసిందని, భూములు కోల్పోయిన ప్రతీ రైతుకు తగిన న్యాయం జరిగేలా తాను బాధ్యత తీసుకుంటానన్నారు. ఊరికి గ్రామకంఠం ఏర్పాటుచేసి ఆ స్థలాలకు క్రయవిక్రయాలు జరిగేలా అధికారులతో మాట్లాడి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. అలాగే తుక్కుగూడలోని క్యాంపు కార్యాలయంలో లేమూరు రైతులతో కేఎల్లార్ సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల అసత్య ప్రచారాలపై మండిపడ్డారు. కందుకూరు మండలం బేగరికంచ, మీర్ఖాన్‌పేట పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఫోర్త్‌సిటీ వరకు వేసే రోడ్డు వల్ల భూములు కోల్పోయే ప్రతీ రైతుకు పరిహారం అందజేస్తామన్నారు. పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, నాయకులున్నారు. కాగా, తమ భూములు ఫోర్త్‌సిటీ రోడ్డుకు ఇచ్చేది లేదని కేఎల్లార్‌తో లేమూరు, అగర్‌మియాగూడ రైతులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సుధాకర్‌రెడ్డి అనే రైతు తెలిపారు. ఒకవేళ దౌర్జన్యం చేసి భూములను తీసుకుంటే మా కుటుంబ సభ్యులను చంపి శవాలపై రోడ్డు వేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు. కాగా, ఫోర్త్‌సిటీ పనులు పారదర్శకంగా చేయాలని తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. భూములు ఇస్తున్న రైతులకు పరిహారం మూడింతలు చెల్లించాలని కోరారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్టు

చేవెళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న పీడీఎస్‌యూ నాయకులను పోలీస్‌లు ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికం అని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ తెలిపారు. గురువారం ఆయన చేవెళ్లలో మాట్లాడుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు లగచర్లలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుండగా పోలీస్‌లు పరిగిలో అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు.

పూలే జీవితం ఆదర్శనీయం



కడ్తాల : పూలే వర్ధంతిలో శ్రీనివాస్‌గౌడ్, దశరథ్, శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్, భాస్కర్‌రెడ్డి



కొత్తూర్ : పూలే విగ్రహం వద్ద నాయకుల నివాళి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యాన్ని నింపి.. వారు విద్య, రాజకీయ రంగాల్లో రాణించడానికి మహాత్మా జ్యోతిరావుపూలే కృషి చేశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. పూలే వర్ధంతి సందర్భంగా గురువారం షాద్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, సింగిల్ విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎ.కృష్ణారెడ్డి, జి.బాల్‌రాజ్ గౌడ్, రఘునాయక్, విజయ్‌కుమార్‌రెడ్డి, భార్గవ్ కుమార్‌రెడ్డి, నలమోని శ్రీధర్, అశోక్, చంద్రశేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : జాతి జాగృతికి, బలహీన వర్గాల ఉద్ధరణకు జీవితాన్ని అంకితం చేసిన మహాత్మా జ్యోతీరావుపూలే మార్గం ఆదర్శనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్‌లు అన్నారు. మండల కేంద్రంలో ఆయన వర్ధంతిని గురువారం బీసీ సంక్షేమ సంఘం, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రవి, ఏఎంసీ డైరెక్టర్ నరేశ్ నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనం వద్ద పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పద్మ నర్సింహ, జోత్యయ్య, కృష్ణ, యాదగిరి, గణేశ్, మల్లేశ్, మహేశ్, కుమార్, పాండు, తదితరులున్నారు.

ఆమనగల్లు : పట్టణంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : పూలే సేవలు మరువలేనివని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బి.దేవేందర్‌యాదవ్ అన్నారు. స్థానిక చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు నర్సింహగౌడ్, సోమ్లానాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు గోపాల్‌గౌడ్, విష్ణుమూర్తి, వీరమోని శ్రీనివాస్, శివచారి, బండి కృష్ణ పాల్గొన్నారు.

చౌదరిగూడ : జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయమని ఇంద్రనగర్ బీసీ గురుకుల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలంలోని పలు పాఠశాలల్లో పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఇంద్రనగర్ బీసీ గురుకుల పాఠశాల, బీఆర్‌ఎస్ కార్యాలయంలో నాయకులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, బీఆర్‌ఎస్ నాయకులు జబ్బార్, బాబురావు, మాణయ్య, యాదయ్య, వెంకటేష్, ఇస్మాయిల్, జానీ, మల్లేష్, నర్సింహులు తదితరులున్నారు.

చేవెళ్ల/షాబాద్ : జ్యోతిరావుపూలే సేవలు మరువలేనివాని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ తెలిపారు. చేవెళ్ల, షాబాద్ మండల కేంద్రాల్లో బీసీ నాయకులతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో చేవెళ్ల షాబాద్ మండలాల నాయకులు రామస్వామి, శ్రీనివాస్, జంగయ్య, రవీందర్, నర్సింలు, గడ్డం చంద్రయ్య, రాములు, మహేందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో ముదిరాజ్‌లకు రాజకీయ అవకాశాలు



పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మధు, ఎమ్మెల్యే శ్రీహరి

శంకర్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కులగణనతో ముదిరాజ్‌లకు రాజకీయ అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. శంకర్‌పల్లిలో గురువారం నూతనంగా నిర్మించిన ముదిరాజ్‌సంఘ భవనాన్ని ఆయన మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. పండగ సాయన్న, దివంగల కిచ్చన్నపల్లి రవిందర్‌ల విగ్రహాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా రాణించాలని అన్నారు. సంఘటితంగా ఎదగడానికి ప్రయత్నించాలన్నారు. సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు రాజు, శంకర్‌పల్లి మండలాధ్యక్షుడు మైసయ్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్. నాయకులు అంది బాబయ్య, డాక్టర్ మద్దెల సంతోష్, నారాయణ, శ్రీకాంత్, నరేష్, వెంకటేష్, లింగం, జంగయ్య, రాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి నియోజకవర్గానికి మూడు 108 అంబులెన్స్‌లు మంజూరు

ఆమనగల్లు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మూడు 108 అంబులెన్స్‌లను మంజూరు చేసిందని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవతో మంత్రి దామోదర రాజనర్సింహ అంబులెన్స్‌లను కేటాయించినట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. అంబులెన్స్‌లు లేని రాష్ట్రంలోని అన్ని మండలాలకు ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. నియోజకవర్గంలోని కడ్తాల, వెల్దండ, మాడ్గుల మండలాలకు కొత్తగా 108 అంబులెన్స్‌లు కేటాయించినట్లు తెలిపారు. అంబులెన్స్‌ల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ్మ, కాంగ్రెస్ కడ్తాల మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఉన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ తాలూకా అధ్యక్షుడిగా లక్ష్మణ్‌నాయక్

కొత్తూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ తాలూకా ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా మల్లాపూర్‌తండాకు చెందిన పాత్లావత్ లక్ష్మణ్ నాయక్‌ను గురువారం షాద్‌నగర్ పార్టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు రాంబాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ర్భంగా లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



శంషాబాద్ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం నర్కూడకు చెందిన కొర్ర రుక్మమ్మకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన అందించారు. మండల నాయకులు నీరటి రాజు ముదిరాజ్, నందనవెల్లి శ్రీనివాస్, గుండాల విశ్వనాథం, నీరటి అశోక్ ముదిరాజ్, కొర్ర శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కడ్తాల్ :** రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి కాంగ్రెస్ జిల్లా నాయకుడు జర్పుల లక్‌పతి నాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ పాలక వర్గానికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్‌పతి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ నరేశ్ నాయక్‌లను సత్కరించి అభినందించారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, నాయకులున్నారు.
- **శంషాబాద్ రూరల్ :** మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ వేతనాలను అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు గణేశ్ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.
- **ఆమనగల్లు :** ఆమనగల్లు మార్కెట్ డైరెక్టర్‌గా నియమితులైన వస్పుల శ్రీశైలం ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.
- **తలకొండపల్లి :** గట్టిప్పలపల్లికి చెందిన పెంటమల్ల మహేశ్ ఇంటినిర్మాణానికి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు చేయూతనందించారు. సేవా దివస్ కార్యక్రమంలో భాగంగా శివాజీ శాఖ ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు మహేశ్ ఇంటిని పరిశీలించారు. సరైన ఇల్లు లేక ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందులను చూసి స్వయం సేవకులు తలా కొంత పోగుచేసి రూ.20 వేలు సమకూర్చి అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. భాస్కర్, సాయిరామ్, ప్రవీణ్, అరుణ్, నరేశ్, శివ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.
- **యాచారం :** మండలంలోని కుర్మిద్ద మాజీ సర్పంచ్ బి.రాజశేఖర్‌రెడ్డి దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు అందించారు. దివ్యాంగులకు తనవంతు సాయమందించి ఆదుకుంటామన్నారు. మల్కాపురంశి వశంకర్, కృష్ణయ్య, వెంకటయ్య, మహేందర్, శివరాజ్, సుజాత తదితరులున్నారు.
- **ఆమనగల్లు :** దీక్ష దివస్ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ ఆమనగల్లు మండల అధ్యక్షుడు అర్జున్‌రావు కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నేడు(శుక్రవారం) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి దీక్ష దివస్ ప్రారంభమవుతుందని చెప్పారు.
- **కందుకూరు :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా తీసుకోవాలని నేదునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం కోరారు. ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో పాత పుస్తకాలు, ప్లాస్టిక్ వస్తువులను అధికంగా తెచ్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.
- **చౌదరిగూడ :** షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొందుర్గు మండలం ఆగిర్యాలకు చెందిన సులోచనా కృష్ణారెడ్డిని కొందుర్గు గ్రామానికి చెందిన శరత్‌కుమార్ శాలువాతో సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, బ్యాటరీ కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- **మాడ్గుల :** మహబూబ్ నగర్‌లో ఈ నెల 28, 29, 30వ తేదీల్లో రైతు పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, మాడ్గుల మండలంలోని రైతులు తరలిరావాలని ఏవో అరుణకుమారి కోరారు. నేడు(శుక్రవారం) నిర్వహించే కార్యక్రమానికి వెళ్లేందుకు ఇర్విన్‌కు ఒక బస్సు, మాడ్గులకు ఒక బస్సు వ్యవసాయశాఖ వారు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.
- **షాద్‌నగర్ అర్బన్ :** ఆర్టీసీ ఉద్యోగులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పనిచేస్తూ సంస్థ అభివృద్ధికై శ్రమించాలని షాద్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉష కార్మికులను కోరారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో గురువారం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మికులచే వివిధ ఆటలు ఆడించి, బహుమతులను ప్రదానం చేశారు. డీఎం మాట్లాడుతూ కార్మికులు సోదరభావం, ఐకమత్యంతో పనిచేస్తూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేర్చడానికి కృషిచేయాలని కోరారు. అనంతరం కార్మికులందరు వనభోజనంలో పాల్గొన్నారు.
- **ఆమనగల్లు :** ఆమనగల్లు-మాడ్గుల ప్రధాన రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని పలువురు నాయకులు కోరారు. ఆమనగల్లుకు వచ్చిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు అప్పం శ్రీను ఆధ్వర్యంలో రోడ్డుకిరువైపులా ఉన్న నివాసస్థులు వినతిపత్రం అందజేశారు.

క్రైం కార్నర్

కారు డ్రైవర్ అదృశ్యం

శంషాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కారు డ్రైవర్ అదృశ్యమైన సంఘటన గురువారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని నర్కూడకు చెందిన గుడెపు చంద్రయ్య, లావణ్య దంపతుల కుమారుడు గుడెపు అఖిల్ (25) గత కొంత కాలం నుంచి కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 26 తేదిన కొండాపూర్ వెళ్తునానని వెళ్లాడు. అయితే సాయంత్రం 8 గంటలైన ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి లావణ్య కుమారుడికి పలుమార్లు ఫోన్ కాల్ చేసిన స్పందించలేదు. ఈ నెల 27 తేది వరకు బంధువుల,స్నేహితుల వద్ద ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన వ్యక్తి ఒంటిపై బ్లూ కలర్ ఫ్యాంట్, షర్ట్ ధరించి ఉన్నాడని ఎవరికైన ఆచూకీ తెలిస్తే శంషాబాద్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ తెలిపారు.